



# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్ EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 186 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-

సోమవారం 10 ఫిబ్రవరి 2025

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# బ్యాటర్ బంతి మాత్రమే కన్పించినట్లుగా.. :'పరీక్షాపే చర్చ'లో విద్యార్థులకు మోదీ సలహాలు

**ప్రధాని మోదీ పరీక్షా పే చర్చలో భాగంగా విద్యార్థులతో మాట్లాడారు.**

దిల్లీ, ఫిబ్రవరి 10, (రిపబ్లిక్ న్యూస్): పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ఏటా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'పరీక్షా పే చర్చా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 8వ ఎడిషన్ పరీక్షా పే చర్చ వీడియోను సోమవారం ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. దిల్లీలోని సుందరవనంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎప్పుడూ ఒక పెద్ద హాల్లో పరీక్షలకు సంబంధించిన అనుమానాలు, ఒత్తిడి తట్టుకోవడం ఎలా అనే అంశాలపై సోదాహరణంగా వివరించే మోదీ.. ఈసారి విభిన్నంగా విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమం కోసం 3.15 కోట్ల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, వారిలో 19.80 లక్షల మంది టీచర్లు, 5.20 లక్షల మంది తల్లిదండ్రులు ఉన్నారు. నేరుగా మాత్రం 36 మంది, మిగతావారంతా వర్చువల్గా పాల్గొన్నారు. సుందరవనంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ప్రధాని బదులిచ్చారు. పరీక్షలే సర్వస్వం కాదన్నారు. మనం రోబోలం కాదని, మనషులమని, ఒక దగ్గరే గిరిగీసుకొని ఉండొద్దని సూచించారు.



### ఒక బ్యాట్స్‌మన్‌లా ఫోకస్ పెట్టాలి..

"బయటినుంచి వచ్చే ఒత్తిడి మీద కాకుండా చదువుమీద దృష్టిపెట్టాలి. స్టేడియంలో వీక్షకులు కేకలేస్తూ, కేరింతలు కొడుతూ ఎంతగా శబ్దాలు చేస్తున్నా.. బ్యాటర్ దృష్టి మాత్రం బంతిపైనే ఉంటుంది. అలాగే విద్యార్థులు కూడా నేర్చుకోవడంపైనే దృష్టిపెట్టాలి" అని అన్నారు. కంటినిండా నిద్ర, సమతుల ఆహారం ముఖ్యమని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు.

### ఒక పేపర్ తీసుకొని రాసుకోవాలి..

"సమయపాలన అన్నింటికంటే ముఖ్యం. రేపు మీరు ఏం చేయాలని అనుకుంటున్నారో ఒక కాగితం మీద రాసుకోవాలి. ఏ పని కోసం ఎంత సమయం వెచ్చించాలో ఆలోచించుకోండి. మీకు ఇష్టమైన సబ్జెక్ట్ ఎక్కువ సమయం, ఇష్టం లేని దానికి తక్కువ సమయం కేటాయించొద్దు. దానికి భిన్నంగా చేయండి. కష్టమైన పాఠ్యాంశాన్ని ఒక సవాలుగా స్వీకరించండి" అని సలహా ఇచ్చారు. "స్నేహితుల్లో మంచి లక్షణాలు గమనించండి. దానివల్ల ప్రతి పనిలో సానుకూలతను చూసే అలవాటు పెరుగుతుంది. ఇక స్నేహితుల కష్టాలను అర్థం చేసుకునేందుకు వారితో మాట్లాడండి" అని అన్నారు.

### ప్రతిఒక్కరికీ ఒక్కో టాలెంట్..

"ప్రతి విద్యార్థికి భిన్నమైన టాలెంట్ ఉంటుంది. కొంతమంది చదువులో ముందుంటారు. మరికొందరికి మంచి డ్రెస్సింగ్ స్టైల్ ఉంటుంది. విద్య సమగ్ర అభివృద్ధి కోసం ఉద్దేశించినది. విద్యార్థులు నాలుగు గోడలకే పరిమితం కాకూడదు. వారు తమ అభిరుచుల వైపు మళ్లేందుకు స్వేచ్ఛ అవసరం. పరీక్షలే సర్వస్వం అనే భావనలో జీవించకూడదు. పిల్లలకు సలహాలు ఇవ్వకూడదు. వారిలో ఎలాంటి నైపుణ్యాలు ఉన్నాయో గమనించాలి. వారిలో ఉన్న విశిష్టమైన ప్రతిభను వెలికితీయాలి" అని చిన్నారులు, టీచర్లకు మోదీ సూచించారు. ఈ సందర్భంగా క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ను ప్రధాని ఉదహరించారు. 'సచిన్కు చదువు కంటే ఆటల మీదే ఆసక్తి ఎక్కువ ఉండేది. దాన్ని గుర్తించిన అతడి తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు' అని ప్రధాని గుర్తుచేశారు.

### ఆశ్చర్యపోయిన మోదీ..

కేరళ నుంచి వచ్చిన విద్యార్థి ఆకాంక్షా ప్రధాని మోదీని హిందీలో పలకరించారు. దాంతో ఆశ్చర్యపోయిన ఆయన.. ఇంత చక్కగా హిందీ ఎలా నేర్చుకున్నావంటూ ప్రశ్నించారు. "నాకు హిందీ అంటే చాలా ఇష్టం. నేనొక కవిత కూడా రాశా" అంటూ దానిని చదివి వినిపించారు. అలాగే.. మీరు ప్రధాని కాకపోయి ఉంటే ఏ మంత్రిత్వ శాఖ తీసుకుంటారని ఓ విద్యార్థి మోదీని అడిగారు. దీనికి ఆయన బదులిస్తూ.. నైపుణ్యాభివృద్ధి శాఖ అంటే ఆసక్తి' అని చెప్పారు.

# మానవత్వం చాటుకున్న ఏపీ మంత్రి అనిత

**ఏపీ హోంమంత్రి అనిత మానవత్వం చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతికి స్వయంగా సపర్యలు చేశారు.**



నరసరావుపేట, ఫిబ్రవరి 10, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ హోంమంత్రి అనిత మానవత్వం చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతికి స్వయంగా సపర్యలు చేశారు. ఈ ఘటన పల్నాడు జిల్లా నరసరావు పేటలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నరసరావుపేట బైపాస్ రోడ్డులోని వై జంక్షన్ వద్ద సోమవారం ఉదయం బైక్ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఓ యువతికి గాయాలయ్యాయి. అదే మార్గంలో శ్రీశైలం పర్యటనకు వెళ్తున్న మంత్రి అనిత దీన్ని గమనించి తన కాన్వాయ్ను ఆపారు. గాయపడిన యువతి వద్దకు వెళ్లి సపర్యలు చేశారు. మంచినీరు అందించి ధైర్యం చెప్పారు. అనంతరం వేరే వాహనంలో ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు.

# హైదరాబాద్‌లో 'మృతదేహానికి చికిత్స'.. ఘటనపై మంత్రి దామోదర రాజనర్సింహ సీరియస్

**మదీనాగూడ సిద్ధార్థ ఆసుపత్రి తీరుపై తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.**

హైదరాబాద్, ఫిబ్రవరి 10, (రిపబ్లిక్ న్యూస్): నగరంలోని మదీనాగూడ సిద్ధార్థ ఆస్పత్రి తీరుపై తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో రెండు రోజులు మృతదేహానికి చికిత్స చేసినట్లు మీడియాలో వచ్చిన కథనాలపై మంత్రి స్పందించారు. మంత్రి దామోదర ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ అధికారులు ఆస్పత్రికి చేరుకొని తనిఖీలు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్వో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు, వైద్యుల బృందం ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్నారు.



# జనసేన నేత కిరణ్ రాయల్ పై ఆరోపణలు చేసిన మహిళ అరెస్ట్!

**జనసేన నేత కిరణ్ రాయల్ పై ఆరోపణలు చేసిన మహిళ వ్యవహారంలో ట్విస్ట్ చోటుచేసుకుంది. తిరుపతి ప్రెస్‌కబ్‌లో ప్రెస్ మీట్ ముగించుకుని వస్తున్న ఆమెను రాజస్థాన్లోని జైపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు.**

తిరుపతి, ఫిబ్రవరి 10, (రిపబ్లిక్ న్యూస్): జనసేన నేత కిరణ్ రాయల్ పై ఆరోపణలు చేసిన మహిళ వ్యవహారంలో ట్విస్ట్ చోటుచేసుకుంది. తిరుపతి ప్రెస్ క్లబ్లో ప్రెస్మీట్ ముగించుకుని వస్తున్న ఆమెను రాజస్థాన్లోని జైపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు.

ఆన్లైన్ మోసం కేసులో ఆ మహిళను అరెస్ట్ చేసినట్లు సమాచారం. అనంతరం ఆమెను ఎస్వీయూ పీఎస్కు తరలించారు. ఆర్థిక లావాదేవీలు, ఇతర వివాదాల నేపథ్యంలో కిరణ్ రాయల్పై ఆమె సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు ప్రెస్‌మీట్‌లో కిరణ్ రాయల్ పై సదరు మహిళ మరికొన్ని ఆరోపణలు చేశారు. ఆయన మాయమాటలకు తాను మోసపోయానన్నారు. తన పిల్లల భవిష్యత్తు కోసం పోరాడుతున్నట్లు వెల్లడించారు. కిరణ్ రాయల్ నుంచి ప్రాణ హాని ఉన్నట్లు ఆరోపించారు. తనకు ఏ పార్టీ నుంచి మద్దతు లేదని.. డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీని గ్రీవెన్స్‌లో కలిసి ఆమె ఫిర్యాదు చేశారు.



# కేంద్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా జనగణన చేపట్టాలి :సోనియా

**గత కొన్నేళ్లుగా జనగణన జరగకపోవడం వల్ల 14 కోట్ల మంది ప్రజలు జాతీయ ఆహార భద్రతాచట్టం ప్రయోజనాలు కోల్పోతున్నారని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ అన్నారు.**

దిల్లీ, ఫిబ్రవరి 10, (రిపబ్లిక్ న్యూస్): కేంద్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా జనగణన చేపట్టాలని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ డిమాండ్ చేశారు. 140 కోట్ల మందికి ఆహార భద్రత కల్పించాలనే ఉద్దేశంతో యూపీఏ హయాంలో తాము జాతీయ ఆహార భద్రతా చట్టం తీసుకొచ్చామని పేర్కొన్నారు. జనగణన జరగకపోవడం వల్ల 14 కోట్ల మంది ప్రజలు జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రయోజనాలు కోల్పోతున్నారని అన్నారు. 2011 జనాభా లెక్కలనే పరిగణనలోకి తీసుకోవడం వల్ల ఇలా జరుగుతోందని తెలిపారు.

కాబట్టి భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం



త్వరగా జనగణన నిర్వహించాలని కోరారు. 2013 సెప్టెంబరులో తాము రూపొందించిన ఎన్ఎఫ్ఎస్ఏ చట్టం దేశంలోని 140 కోట్ల జనాభాకు పోషకాహార భద్రత కల్పించడంలో ఓ మైలురాయిగా మారిందని అన్నారు. ముఖ్యంగా కొవిడ్ సమయంలో ఈ చట్టం లక్షలాది కుటుంబాల కడుపు నింపిందని గుర్తుచేశారు. త్వరగా జనగణన చేపట్టడం వల్ల ఎన్ఎఫ్ఎస్ఏ కింద ఎందరో పేద ప్రజలు లబ్ధి పొందుతారని అన్నారు. ప్రజలకు ఆహార భద్రత ప్రత్యేక హక్కు కాదని.. ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. రాజ్యసభ సమావేశంలో పాల్గొన్న సోనియాగాంధీ జీరో అవర్ లో ప్రజల ఆహార భద్రత గురించి ప్రసంగించారు. స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఎన్డీఏ పాలనలో దేశంలో జనాభా గణన నాలుగేళ్లకు పైగా ఆలస్యమయ్యిందని సోనియా విమర్శించారు. వాస్తవానికి 2021లోనే జనగణన నిర్వహించాల్సిఉండగా కేంద్ర ప్రభుత్వం దానిని విస్మరించిందని అన్నారు. తిరిగి ఎప్పుడు చేపడతారనే విషయంపై ఇప్పటి వరకు స్పష్టత లేదని అసహనం వ్యక్తంచేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జాతీయ ఆహార భద్రతా చట్టం దాదాపు 81.35 కోట్లమంది ప్రజలు లబ్ధి పొందారని సోనియా తెలిపారు. గ్రామీణ జనాభాలో 75 శాతం, పట్టణ జనాభాలో 50శాతం ప్రజలు దీనిద్వారా ప్రయోజనం పొందారన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి వ్యక్తికి నెలకు 5 కిలోల ఆహారధాన్యాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది.

# దిల్లీ కొత్త సీఎం 'శీష్ మహల్'లో ఉండరట..!

**దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శీష్ మహల్ పేరు అందరి నోళ్లలో నానింది. ఇప్పుడు కొత్త సీఎం అందులో ఉండకపోవచ్చని తెలుస్తోంది.**

దిల్లీ, ఫిబ్రవరి 10, (రిపబ్లిక్ న్యూస్): దేశ రాజధాని దిల్లీ శాసనసభ ఎన్నికల్లో భాజపా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో దిల్లీకి కొత్త ముఖ్యమంత్రి రానున్నారు. సీఎంను ఎంచుకునే ప్రక్రియను భాజపా ముమ్మరంగా కొనసాగిస్తోంది. ఈ తరుణంలో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. దిల్లీ కొత్త సీఎం శీష్ మహల్‌లో నివాసం ఉండకపోవచ్చని తెలుస్తోంది.

ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా పనిచేసిన సమయంలో సివిల్ లైన్స్లో 6 ఫ్లాగ్‌ఫ్ రోడ్ బంగ్లాను అధికారిక నివాసంగా ఉపయోగించేవారు. ఆ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా భాజపా అభివర్ణించింది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన 7-స్టార్ రిసార్ట్ మార్చుకున్నారని విమర్శించింది. నాలుగు కోట్ల మందికి ఇళ్లు కట్టించామని, కానీ.. తానేమీ అద్దాల మేడ కట్టుకోలేదని ప్రధాని మోదీ దుయ్యబట్టిన సంగతి తెలిసిందే. ఆప్ మోసాలకు ఆ మహల్ ఓ ఉదాహరణ అంటూ భాజపా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది. ఆప్ ప్రభుత్వంపై వచ్చిన ఈ అవినీతి ఆరోపణలు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని దెబ్బతీశాయి. భాజపాకు విజయాన్ని కట్టబెట్టాయి. అందుకే విమర్శలకు తావులేకుండా ఆ బంగ్లాకు దూరంగా ఉండాలని భాజపా యోచిస్తున్నట్లు సమాచారం. ఇదిలాఉంటే.. న్యూదిల్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కేజ్రీవాల్పై మాజీ ముఖ్యమంత్రి సాహిబ్సింగ్ వర్మ తనయుడు పర్వేశ్ వర్మ విజయం సాధించారు. ఆయనకే సీఎం పోస్టు దక్కే అవకాశాలు ఉన్నట్లు ఇప్పటికే సంకేతాలు వెలువడిన విషయం తెలిసిందే. ఇక ఈ అంశంపై ఆయన భాజపా జాతీయాధ్యక్షుడు జె.పి.నడ్డా, కేంద్ర హోం



మంత్రి అమిత్షాతో భేటీ అయ్యారు. ప్రధాని సోమవారం నుంచి ఫ్రాన్స్, అమెరికాల్లో పర్యటనకు వెళ్లనుండటంతో ఆయన తిరిగి వచ్చాకే సీఎం ప్రమాణస్వీకారం వేడుకను నిర్వహించాలని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. సీఎంగా మహిళకు అవకాశం ఇవ్వదలచుకుంటే రేఖా గుప్తా, శిఖారాయ్లలో ఒకరిని పార్టీ ఎంచుకోవచ్చని తెలుస్తోంది. ఎమ్మెల్యేలను కాకుండా సిట్టింగ్ ఎంపీల్లో ఎవరినైనా సీఎం పీఠంపై కూర్చోబెట్టాలని భావిస్తే మాత్రం హర్ష్ మల్హోత్రా (తూర్పు దిల్లీ ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి), మనోజ్ తివారీ (ఈశాన్య దిల్లీ ఎంపీ)ల్లో ఒకరికి అవకాశం దక్కవచ్చు.

# పటియాలాలో భారీగా ఆయుధాలు.. ఏడు రాకెట్ల స్వాధీనం..!

**పంజాబ్‌లోని పటియాలాలో రాకెట్ల డంప్ను పోలీసులు గుర్తించారు.**

పటియాలా, ఫిబ్రవరి 10, (రిపబ్లిక్ న్యూస్): పంజాబ్‌లో భారీగా ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. వీటిల్లో ఏడు రాకెట్లు కూడా ఉండటంతో స్థానికులతోపాటు అధికారులు కూడా ఉలిక్కిపడ్డారు. స్థానికంగా రాజ్పురా రోడ్లోని ఓ పాఠశాల సమీపంలోని చెత్త కుప్పలోని ఓ సంచిలో ఏవో అనుమానాస్పద వస్తువులు ఉండటంతో పోలీసులకు సమాచారం అందింది.



దీంతో వారు అక్కడకు చేరుకొని తనిఖీలు చేయగా ఆయుధ డంపు బయటపడింది. ఈ ఘటనపై ఎస్ఎస్ పీ నానక్ సింగ్ మాట్లాడుతూ "ప్రాథమికంగా దర్యాప్తు ప్రకారం ఓ చెత్త వ్యాపారి వాటిని తీసుకొచ్చి ఇక్కడ పడేసి ఉండొచ్చు" అని వెల్లడించారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం సైన్యానికి కూడా సమాచారం అందించినట్లు వెల్లడించారు. అసలు ఈ రాకెట్ లాంచర్లకు అక్కడకు ఎలా చేరాయి, ఎవరు తీసుకొచ్చారు అనేది దర్యాప్తు చేస్తున్నారు. దీని వెనుక ఉగ్ర కోణాన్ని మాత్రం వారు కొట్టిపారేయలేదు. 2022లో తర్వరన్ జిల్లాలోని సర్హలీ పోలీస్ స్టేషన్ పై రాకెట్ లాంచర్తో దాడి చేశారు. అక్కడికి సమీపంలోని జాతీయ రహదారి మీదుగా రాకెట్ ప్రొపెల్డ్ గ్రనేడ్ను వాడినట్లు గుర్తించారు. నాడు ఈ దాడికి ఓ ఖలిస్థానీ ముఠా కారణమని తేలింది. కానీ, 2023లో ఈ దాడికి సంబంధించి గురుపిందర్ అలియాస్ పిందూను అరెస్టు చేశారు. ఇతడు కెనడాకు చెందిన ఉగ్రవాది లక్బీర్ సింగ్‌కు సన్నిహితుడిగా గుర్తించారు.

# ఇదేం వింత? చట్టాలు, రూల్స్ మార్చి జగన్కు సమయం ఇవ్వలేం కదా!: ఏపీ స్పీకర్

**అసెంబ్లీకి రాకుండా ప్యాలెస్లో కూర్చొని మాట్లాడితే.. ప్రభుత్వం, మంత్రులు అసెంబ్లీలో సమాధానం చెప్పాలని వైకాపా నేతలు అనడం వింతగా ఉందని ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. భారతదేశంలో ఎక్కడైనా ఇలాంటిది. ఉందా? చట్టాలపై అవగాహన ఉండే మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు.**


దిల్లీ, ఫిబ్రవరి 10, (రిపబ్లిక్ న్యూస్): అసెంబ్లీకి రాకుండా ప్యాలెస్లో కూర్చొని మాట్లాడితే.. ప్రభుత్వం, మంత్రులు అసెంబ్లీలో సమాధానం చెప్పాలని వైకాపా నేతలు అనడం వింతగా ఉందని ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. భారతదేశంలో ఎక్కడైనా ఇలాంటిది ఉందా? చట్టాలపై అవగాహన ఉండే మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబుకు ఇచ్చినంత సమయమే తనకూ కావాలని జగన్ అడుగుతున్నారన్న ఆయన.. ఏ రూల్ ప్రకారం ఇవ్వాలి? ఎందుకు ఇవ్వాలని నిలదీశారు. సోమవారం మధ్యాహ్నం ఢిల్లీలో లోకసభ స్పీకర్ ఓం బిర్లాను కలిసిన అనంతరం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. "జగన్ ప్రతిపక్ష నేత కాదు. ఆ హోదాకు తగిన సంఖ్యా బలం వైకాపాకు లేదనేది జగమెరిగిన సత్యం. కానీ, అది జగన్కు తెలియకపోవడమే బాధాకరం. చట్టాలు, రూల్స్ జగన్ తెలుసుకోవాలి. చట్టాలు, నిబంధనలు మార్చి జగన్కు సమయం ఇవ్వలేం కదా!' అని చురకలంటించారు. "అనుమతి లేకుండా 60 రోజులు అసెంబ్లీకి రాకపోతే చర్యలు తీసుకోవచ్చు. ఫలానా కారణం వల్ల సభకు రాలేకపోతున్నానని స్పీకర్కు లేఖ ఇవ్వాల్సి ఉంటుంది. సభ్యుల లేఖలో సహేతుక కారణం ఉంటే స్పీకర్ అనుమతి ఇస్తారు. సభకు రాని సభ్యులు వ్యక్తిగతంగా లేఖలు ఇవ్వాల్సి ఉంటుంది. వైకాపాలో మిగతా ఎమ్మెల్యేలకు మాట్లాడే అవకాశం జగన్ ఇవ్వాలి. వారి వారి నియోజకవర్గాల సమస్యలను చెప్పుకొనే అవకాశం కల్పించాలి. సభకు వచ్చి సమస్యలపై మాట్లాడాలని జగన్, వైకాపా ఎమ్మెల్యేలను కోరుతున్నా. అసెంబ్లీ హాజరు జాబితాలో నకిలీ సంతకాలు పెట్టేందుకు కుదరదు" అని స్పష్టం చేశారు.



# ఏపీ సీఐడీ విచారణకు రాంగోపాల్ వర్మ గైర్హాజరు

**ఏపీ సీఐడీ అధికారుల విచారణకు దర్శకుడు రాంగోపాల్వర్మ (ఆర్జీవీ) గైర్హాజరయ్యారు.**

గుంటూరు, ఫిబ్రవరి 10, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ సీఐడీ అధికారుల విచారణకు దర్శకుడు రాంగోపాల్వర్మ (ఆర్జీవీ) గైర్హాజరయ్యారు. తన తరపున న్యాయవాదిని సీఐడీ కార్యాలయానికి పంపారు. సినిమా ప్రమోషన్లో ఉన్నందున విచారణకు రాలేనని పేర్కొంటూ.. 8 వారాల గడువు కోరారు. ఈ నేపథ్యంలో ఆర్జీవీకి మంగళవారం మళ్లీ నోటీసులు ఇవ్వాలని సీఐడీ యోచిస్తోంది. రాంగోపాల్ వర్మ 2019లో 'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' పేరుతో ఓ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆ చిత్రం పేరుపై తెలంగాణ హైకోర్టులో కొందరు పిల్ వేయడంతో 'అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు' అనే పేరుతో విడుదల చేశారు. అయితే యూట్యూబ్లో మాత్రం 'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' పేరిటే విడుదల చేశారంటూ సీఐడీ పోలీసులకు మంగళగిరి సమీపంలోని ఆత్మకూరు చెందిన వంశీకృష్ణ బండారు ఫిర్యాదు చేశారు. అందులో ఉద్రేకపూరిత దృశ్యాలను తొలగించలేదని పేర్కొన్నారు. ఈ మేరకు వర్మపై మంగళగిరిలోని సీఐడీ పోలీస్ స్టేషన్లో గతేడాది నవంబరు 29న కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించిన నోటీసులను ఆర్జీవీకి ఇటీవల ఒంగోలులో సీఐడీ అధికారులు అందజేశారు. ఈ కేసులో విచారణకు నేడు ఆయన హాజరుకావాల్సి ఉండగా గడుపు కోరారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com


ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్




## చరిత్రలో నేటి ప్రత్యేకత


- **1837:** ఆధునిక రష్యా సాహిత్యానికి పితామహుడు అలెగ్జాండర్ పుష్కిన్ మరణం.
- **1902:** ఇన్‌వెంటర్ మరియు ప్రాట్ & విట్నీ కంపెనీ స్థాపకుడు ఫ్రాంసిస్ ప్రాట్ మరణం.
- **1911:** భారత్‌లో విమానం ద్వారా తపాలా బట్వాడా మొదలయింది.
- **1923:** X కిరణాల సృష్టికర్త విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్ మరణం. (జననం. 1845)
- **1931:** కొత్త ఢిల్లీ నగరం అధికారికంగా ప్రారంభించబడింది.
- **1950:** స్విమ్మింగ్ క్రీడాకారుడు మార్క్ స్పిట్జ్ జననం. (చిత్రంలో)
- **2010:** భారత ఆర్థికవేత్త, తొలి ప్రణాళికా సంఘం సభ్యుడు కె.ఎన్.రాజ్ మరణం.
- **2010:** యునైటెడ్ స్టేట్స్‌లో ఒక నావికా దళ అధికారి చార్ల్స్ విల్సన్ మరణం.


అలెగ్జాండర్ పుష్కిన్


ఫ్రాంసిస్ ప్రాట్


తపాలా విమానం


విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్


భారతదేశ పార్లమెంట్


మార్క్ స్పిట్జ్


కె.ఎన్.రాజ్


చార్ల్స్ విల్సన్

రిపబ్లిక్ స్పోర్ట్స్

## రోహిత్ ఫామ్లోకి వచ్చేశాడు.. మరి కోహ్లి..?

అభిమానులు ముద్దుగా 'రోకో' అని పిలిచుకునే రోహిత్-కోహ్లి జంటలో.. హిట్ మ్యాన్ ఇంగ్లాండ్ తో రెండో వన్డేలో తిరిగి పామ్లోకి వచ్చాడు. ఇక కోహ్లి వంతేనని.. అతడు మునుపటి ఫామ్లోకి తిరిగి రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.



ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమ్ ఇండియాకు పెద్ద ఊరట. కెప్టెన్ రోహిత్ శర్మ తిరిగి ఫామ్లోకి రావడం. ఇంగ్లాండ్‌తో రెండో వన్డేలో అద్భుత శతకంతో చెలరేగి ఆడిన హిట్మ్యాన్.. తన ఫామ్పై ఇటీవల వచ్చిన విమర్శలకు బ్యాట్తోనే సమాధానం చెప్పాడు. తనదైన ట్రేడ్మార్క్ షాట్లు ఆడుతూ.. మరోసారి అభిమానుల ముందు మునుపటి రోహిత్‌ను ఆవిష్కరించాడు. 90 బంతుల్లో 119 పరుగులు చేసి వన్డేల్లో తన రెండో వేగవంతమైన సెంచరీని నమోదు చేశాడు. ఈనేపథ్యంలో టీమ్ ఇండియా అభిమానుల్లో ఇప్పుడు ఒక్కటే ప్రశ్న.. రోహిత్ ఫామ్లోకి వచ్చాడు.. మరి విరాట్ కోహ్లి మాటేమిటి..?

గత కొంతకాలంగా టీన్ఇండియా స్టార్ బ్యాటర్లైన రోహిత్, కోహ్లి పేలవ ఫామ్తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ముగిసిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో వీరిద్దరి ప్రదర్శనపై ఎన్నో విమర్శలు వచ్చాయి. జట్టును వీడి కొత్త వాళ్లకు అవకాశాలు ఇవ్వాలనే కామెంట్లూ వినిపించాయి. ఈ నేపథ్యంలో రోహిత్ తన పామ్ పై అనుమానాలను పటాపంచలు చేస్తూ అద్భుత ఆటతీరుతో ఛాంపియన్స్ ట్రోఫీకి పది రోజుల ముందు మునుపటి ఫామ్లోకి వచ్చేశాడు. అయితే కోహ్లి మాత్రం తేలిపోయాడు. మరోసారి అదే ఆటతీరుతో నిరాశ పరిచాడు. ఆదిల్ రషీద్ బౌలింగ్లో 5 పరుగులకే పెవిలియన్కు చేరాడు. దీంతో కోహ్లి తిరిగి ఫామ్లోకి రావాలని అభిమానులు కోరుతున్నారు. రోహిత్ పామ్లోకి వచ్చేశాడు.. ఇక కోహ్లి వంతేనని అభిమానులు అంటున్నారు. రోకో(రోహిత్ శర్మ-విరాట్ కోహ్లి) తిరిగి ఫామ్లోకి వస్తే.. ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ ఇండియాకు తిరుగుండదనడంలో ఎలాంటి సందేహం లేదు.

### ఛాంపియన్స్ ట్రోఫీల్లో వీరి గణాంకాలు ఇలా..

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీల్లో రోహిత్, కోహ్లి భారత్‌కు కీలకంగా వ్యవహరించారు. ఛాంపియన్స్ ట్రోఫీలో విరాట్ ఇప్పటి వరకూ 13 మ్యాచ్లు ఆడి 529 పరుగులు చేశాడు. ఇందులో ఐదు అర్ధ శతకాలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 96 పరుగులు. పరుగుల పరంగా రోహిత్ శర్మ ఆ తర్వాతి స్థానంలో ఉన్నాడు. పది మ్యాచ్లు ఆడిన హిట్మ్యాన్ 481 పరుగులు చేయగా.. ఒక శతకం, నాలుగు అర్ధ శతకాలతో అలరించాడు. ఇందులో అత్యధిక పరుగులు 123. ఇక ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసింది శిఖర్ ధావనే. అతడు మొత్తం పది ఇన్నింగ్స్ ల్లో 701 పరుగులు చేశాడు. ఓవరాల్గా ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు. విరాట్-రోహిత్ తమదైన ఆటతీరుతో చెలరేగి ఆడితే.. ఎలాంటి ప్రత్యర్థుల ముందైనా భారీ లక్ష్యాలను ఉంచగలరు. వీరిద్దరికీ ఈ ఛాంపియన్స్ ట్రోఫీయే చివరిదని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో బ్యాట్తో మరోసారి రాణించాల్సిన అవసరముంది.

### 487 రోజుల తర్వాత..

ఇక రోహిత్కు వన్డేల్లో సుదీర్ఘకాలం అనంతరం వచ్చిన సెంచరీ ఇది. కష్టకాలంలో అతడిలో ఎంతో ఆత్మవిశ్వాసం తీసుకొచ్చిన శతకం ఇది. చివరిసారిగా రోహిత్ వన్డేల్లో అఫ్గానిస్థాన్పై అక్టోబర్ 11, 2023లో సెంచరీ బాదాడు. అన్ని ఫార్మాట్లలో అయితే.. 338 రోజుల తర్వాత వచ్చిన శతకం ఇది. గత ఏడాది మార్చిలో జరిగిన టెస్టుల్లో సెంచరీ బాదాడు.

## ఆర్టీసీ బస్సులో 'తండేల్'.. స్పందించిన నిర్మాత

ఆర్టీసీ బస్సులో 'తండేల్' చిత్రాన్ని ప్రదర్శించడంపై నిర్మాత బన్నివాసు స్పందించారు. ఇది చట్ట విరుద్ధమన్నారు.

తాజాగా విడుదలై హిట్ టాక్ న్ను సొంతం చేసుకున్న చిత్రం 'తండేల్'. ఈ సినిమా విడుదలైన రోజు నుంచే పైరసీ దీన్ని వేధిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఏపీఎస్ఆర్టీసీ బస్సులో దీన్ని ప్రదర్శించడంపై నిర్మాత బన్నివాసు స్పందించారు. సంస్థ ఛైర్మన్కు విజ్ఞప్తి చేస్తూ పోస్ట్ పెట్టారు. "ఓ మీడియా సంస్థలో వచ్చిన వార్త ద్వారా ఏపీఎస్ఆర్టీసీ బస్సులో తండేల్ను ప్రదర్శించారని తెలుసుకున్నాం. ఇది చట్ట విరుద్ధం, అన్యాయం మాత్రమే కాదు సినిమాకు జీవం పోయడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తోన్న ఎంతోమంది వ్యక్తులను అవమానించడమే. ఒక సినిమా ఎంతోమంది ఆర్టిస్టులు, దర్శకులు, నిర్మాతల కల" అని పేర్కొన్నారు. దీనికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల



నారాయణరావును బన్నివాసు కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. నాగచైతన్య, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఫిబ్రవరి 7న థియేటర్లలో విడుదలైంది. దీన్ని పైరసీ చేసి కొందరు ఆన్లైన్ అప్ చేయడంతో అది సోషల్ మీడియాలోనూ తెగ షేర్ అవుతోంది. ఇటీవల ఓ లోకల్ ఛానల్లోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. దీని గురించి నిర్మాత బన్నివాసు ప్రెస్మీట్లో స్పందించారు. "సినిమా పైరసీ వస్తుంది.. చూసేద్దామని చాలామంది అనుకుంటుంటారు. మా 'గీత గోవిందం' సినిమా పైరసీ చేసిన వారిపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. వారిలో కొందరు ఇప్పుడిప్పుడే జైలు నుంచి బయటకు వస్తున్నారు. 'గీతా ఆర్ట్స్' సినిమాలను పైరసీ చేసినవారిని, వాటిని డౌన్లోడ్ చేసుకొని చూసిన వారిని తేలిగ్గా వదిలేస్తామని అనుకోవద్దు" అని పేర్కొన్నారు.

## నాన్నా.. నువ్వు చనిపోతావా ?.. కుమారుడి మాటలు గుర్తుచేసుకున్న సైఫ్ అలీఖాన్

దాడి జరిగిన తర్వాత మొదటిసారి సైఫ్ అలీఖాన్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఆ సమయంలో తన కుమారుడి మాటలు గుర్తుచేసుకున్నారు.

దుండగుడి దాడిలో బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్ గాయపడిన విషయం తెలిసిందే. ఆసుపత్రిలో చికిత్స తీసుకొన్న ఆయన ప్రస్తుతం విశాంత్రి తీసుకుంటున్నారు. దాడి తర్వాత మొదటిసారి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సైఫ్.. ఆరోజు తన కుమారుడు తైమూర్ మాటలను గుర్తుచేసుకున్నారు. కత్తితో పొడిచినట్లు మొదట తనకు తెలియలేదని చిన్న గాయం అయిందనుకున్నట్లు సైఫ్ అన్నారు. తర్వాత వీపు భాగంలో నొప్పి రావడంతో కత్తితో దాడి చేసినట్లు తెలిసిందన్నారు. "నాకు వీపులో విపరీతమైన నొప్పి కలిగింది. అప్పుడు గమనిస్తే కత్తితో దాడి చేసినట్లు తెలిసింది. అది చూసి కరీనాకపూర్ ఎంతో కంగారుపడింది. అందరికీ ఫోన్లు చేసింది. ఎవరూ ఫోన్ తీయలేదు. ఒకరినొకరం చూసుకున్నాం. నేను బాగానే ఉన్నాను.. నాకేం కాదని ఆమెకు ధైర్యం చెప్పాను. తైమూరు నా దగ్గరకు వచ్చి 'నాన్నా.. నువ్వు చనిపోతావా?' అని అడిగాడు. అలా ఏం జరగదన్నాను" అని చెప్పారు. సైఫ్ను ఇబ్రహీం ఆసుపత్రిలో చేర్చినప్పుడు అతడితో పాటు తైమూర్ కూడా ఆసుపత్రికి వచ్చినట్లు లీలావతి వైద్యులు విడుదల చేసిన నివేదికలో ఉంది. దీని గురించి సైఫ్ మాట్లాడుతూ.. "దాడి జరిగిన తర్వాత కొంతసేపటికి నా కుమారుడు చాలా కూల్గా ఆలోచించాడు. 'నేనూ మీతో వస్తాను' అని ఆసుపత్రికి వచ్చాడు. నేను కూడా ఒంటరిగా వెళ్లాలనుకోలేదు. అందుకే నాతోపాటు తైమూర్ను తీసుకెళ్లాను. ఒకవేళ నాకు ఏమైనా జరిగినా ఆ సమయంలో నా కుమారుడు నా పక్కనే ఉండాలని కోరుకున్నాను" అని సైఫ్ వివరించారు. ముగ్గురూ ఆటోలోనే ఆసుపత్రికి వెళ్లినట్లు చెప్పారు. మరోవైపు ఈ దాడి కేసులో కీలక పురోగతి కనిపిస్తోంది. దర్యాప్తులో భాగంగా ముంబయి పోలీసులు ఇటీవల ఐడెంటిఫికేషన్ పెరేడ్ చేపట్టారు. ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్న నిందితుడు మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్ను ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులైన సైఫ్ ఇంటి సహాయకులకు చూపించారు. ఆర్థర్ జైలులో అధికారుల సమక్షంలో జరిగిన ఈ ఐడెంటిఫికేషన్ పెరేడ్లో నిందితుడిని వారు గుర్తించారు. సైఫ్పై దాడి చేసింది అతడేనని తెలిపారు.



రిపబ్లిక్ సినిమా
CINEMA

## సంగీతానికి హద్దులుండవు..
## వైరలవుతున్న 'చుట్టమల్లే'పై స్పందించిన ఎన్టీఆర్

బ్రిటిష్ పాప్ సింగర్ ఎడ్వర్డ్ క్రిస్టోఫర్ షీరాన్ చుట్టమల్లే పాట పాడడంపై ఎన్టీఆర్ స్పందించారు.

ఎన్టీఆర్ 'దేవర'లో 'చుట్టమల్లే' పాట ఎంత వైరలైందో తెలిసిందే. ఆ సాంగ్ విడుదలైన నాటినుంచి ఇప్పటివరకూ సోషల్ మీడియాలో ట్రెండ్ సృష్టిస్తూనే ఉంది. తాజాగా ఈ పాటను బ్రిటిష్ పాప్ సింగర్ ఎడ్వర్డ్ క్రిస్టోఫర్ షీరాన్ పాడారు. దీనికి సంబంధించిన వీడియో క్షణాల్లో వైరల్ గా మారింది.



దీనిపై ఎన్టీఆర్ స్పందించారు. తాజాగా బెంగుళూర్ లో ఎడ్వర్డ్ క్రిస్టోఫర్ షీరాన్ తొలి ప్రదర్శన ఇచ్చారు. ఆ ఈవెంట్లో దేవర సినిమాలోని చుట్టమల్లే సాంగ్ పాడి ఆడియన్స్‌లో జోష్ నింపారు. బ్రిటిష్ సింగర్ నోట తెలుగు పాట రావడంతో ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్గా మారింది. దీనిపై ఎన్టీఆర్ స్పందిస్తూ.. "సంగీతానికి హద్దులు ఉండవు. మీరు ఈ విషయాన్ని మరోసారి నిరూపించారు. మీ గొంతులో చుట్టమల్లే పాట వినడం నిజంగా ప్రత్యేకం" అంటూ ఆ పాప్ సింగర్కు ధన్యవాదాలు తెలిపారు. ఆరేళ్ల తర్వాత యంగ్ టైగర్ సోలో రిలీజ్ ప్రేక్షకుల ముందుకువచ్చిన 'దేవర' సూపర్ హిట్గా నిలిచింది. కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా మంచి వసూళ్లు సాధించింది. ఇందులోని పాటలన్నీ భారీ వ్యూస్ను సొంతం చేసుకున్నాయి. ప్రత్యేకించి 'చుట్టమల్లే' సాంగ్ సోషల్ మీడియాను షేక్ చేసింది. కొన్ని వందల రీల్స్ ఈ పాటపై షేర్ అయ్యాయి. ఎన్టీఆర్ సరసన జాన్వీ నటించిన ఈ సినిమా సీక్వెల్ వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు. మొదటిభాగం కంటే రెండోభాగం చాలా పవర్ఫుల్ ఉంటుందని దర్శకుడు ఇటీవల చెప్పారు. పార్ట్-1లో చూసింది 10 శాతమేనని.. రెండో భాగంలో 100శాతం చూస్తారన్నారు.

## జైల్లో ఉన్నప్పుడు మాత్రమే అంత నిద్ర పోయాను: సల్మాన్ ఖాన్

తాను రోజుకు రెండు గంటలు మాత్రమే నిద్ర పోయినట్లు సల్మాన్ తెలిపారు. జైల్లో మాత్రమే హాయిగా నిద్రపోయినట్లు చెప్పారు.

స్టార్ హీరో సల్మానాఖాన్ తాజాగా ఓ పాడ్కాస్ట్‌లో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తాను నిద్ర తక్కువగా పోతానన్న సల్మాన్ జైల్లో ఉన్నప్పుడు మాత్రమే కావాల్సినంత నిద్రపోయినట్లు తెలిపారు. తన స్లీపింగ్ షెడ్యూల్ను అభిమానులతో పంచుకున్నారు. "నేను సాధారణంగా రోజుకు రెండు గంటలు మాత్రమే నిద్ర పోతాను. నెలకోసారి మాత్రం 8 గంటలు పడుకుంటా. కొన్నిసార్లు సినిమా చిత్రీకరణ సమయంలో సన్నివేశాల మధ్య విరామం వచ్చినప్పుడు ఒక కునుకు తీస్తాను. షూటింగ్లు లేనప్పుడు, ఖాళీగా ఉన్నప్పుడు కావాల్సినంత నిద్ర పోతాను. అందుకే జైల్లో ఉన్నప్పుడు హాయిగా 8 గంటలు నిద్రపోయా. ఒకవేళ నేను ప్రయాణం చేసే విమానంలో సాంకేతిక సమస్య వచ్చి అల్లకల్లోలం అయినా నేను మాత్రం నిద్రపోతాను. ఎందుకంటే అలాంటి పరిస్థితుల్లో నేనేం చేయలేను కదా.." అని తెలిపారు. ఇదే పాడ్కాస్ట్లో పరిశ్రమలో ఉండే పోటీ గురించి మాట్లాడుతూ.. "నేను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు మానాన్న "నువ్వు యాక్షన్ చేయగలవా? ఏం చేస్తావు? 10 మందిని కొడతావా? "ఇలా ఎన్నో ప్రశ్నలు వేశారు. లాయర్, పోలీస్ ఏదోఒకటి కావచ్చు కదా అని అన్నారు. కానీ, యాక్టర్ కావాలని నేను బలంగా కోరుకున్నాను. ఇండస్ట్రీలో పోటీ చాలా ఎక్కువ ఉంటుంది. జీవితంలో సీరియస్గా ఉండాలి. మన తోటి నటులతో పోల్చుకుంటూ ముందుకుసాగాలి. వాళ్లతో పోల్చుకుంటూ కొత్త విషయాలు నేర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలి" అని చెప్పారు. ఇక సినిమాల విషయానికొస్తే.. ఈ బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ప్రస్తుతం 'సికందర్'లో నటిస్తున్నారు. రష్మిక ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఎ.ఆర్. మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నారు. భావోద్వేగాలతో కూడిన ఈ యాక్షన్ చిత్రాన్ని సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. రంజాన్ కానుకగా ఇది ప్రేక్షకుల ముందుకురానుంది.



## ఇంటి చిట్కాలు

## పనీర్ మంచిదని తెగ లాగించేస్తున్నారా, అసలైన పనీర్ కాకపోతే చాలా ఆరోగ్య సమస్యలొస్తాయ్, కల్తీని ఎలా కనిపెట్టాలంటే


పనీర్ వెజిటేరియన్స్‌కి బెస్ట్ ప్రోటీన్ సోర్స్. దీనిని తినడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి. ఆరోగ్యానికి కూడా ఎన్నో లాభాలుంటాయి. అయితే, అసలైన పనీర్‌ని ఎలా కనిపెట్టాలో తెలుసుకోండి.



పనీర్.. ఎవరైనా ఇష్టంగా తినే ఫుడ్ ఐటెమ్. ఈ మిల్క్ ప్రోడక్ట్‌తో మనం స్వీట్స్, స్పైసీ, స్నాక్స్ ఇలా బోలెడు రకాల ఫుడ్ ఐటెమ్స్ చేసి మరీ ఎంజాయ్ చేయొచ్చు. కొన్ని ఫుడ్స్‌ని అంతలా ఇష్టంగా తినరు. కానీ, దీని రుచి కారణంగా, దీని తింటారు. పైగా ఇది హెల్దీ కూడా. అందుకే, చాలా మంది దీనిని తినడానికి ప్రిఫరెన్స్ చూపిస్తారు. అయితే, పనీర్‌ని సాధారణంగా పాలతో తయారు చేస్తారు. అందరూ ఇళ్లలో చేసుకోలేరు. కాబట్టి, బయట నుంచి కొని తెచ్చుకుంటారు. ఈ నేపథ్యంలోనే ప్రతి ఫుడ్‌ని కూడా కల్తీ చేసే కొంతమంది.. పనీర్‌ని కూడా కల్తీగా తయారుచేసి మార్కెట్లోకి పంపి క్యాష్ చేసుకుంటునారు. ఇది తెలియని చాలా మంది వాటి తింటూ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. అలా కాకుండా కల్తీ పనీర్‌ని ఎలా కనిపెట్టాలో తెలుసుకోవాలి.



### పప్పు



పనీర్‌ని కనిపెట్టేందుకు ఇదో బెస్ట్ మెథడ్. ఏంటంటే.. మనం పనీర్ ఉడికిన తర్వాత కొద్దిగా పప్పు వేయడం వల్ల ఈజీగా కనిపెట్టొచ్చు. ఉడికిన పనీర్‌పై కొంచెం పప్పు వేస్తే అదే రెడ్ కలర్‌లోకి మారిందంటే అందులో కల్తీ జరిగనట్లుగానే గుర్తించాలి.

### లేబుల్ చదవడం




మనం బయట కొనుక్కొచ్చే పనీర్‌లో కొంతమంది మెన్షన్ చేస్తారు. లేబుల్‌పై అనలాగ్, అనుకరణ అని మెన్షన్ చేస్తే అది కచ్చితంగా ప్యూర్ మిల్క్‌తో చేసినట్లుగా కాదు. కాబట్టి, ఇది వాడకపోవడమే మంచిది.

### రంగు, రుచి, ఆకృతి




ఇది చూడగానే గుర్తుపటటొచ్చు. నిజమైన పనీర్ అయితే చాలా సాఫ్ట్‌గా ఉంటుంది. దీనిని బ్రేక్ చేయడం కూడా ఈజీ. కానీ, కల్తీ పనీర్ రబ్బర్‌లా ఉంటుంది. దీనిని కట్ చేయడం, నొక్కడం కూడా కష్టంగా ఉంటుంది. పైగా నిజమైన పనీర్ టేస్టీగా పాల రుచిలా ఉంటే కల్తీ జరిగిన పనీర్ మనకి రబ్బర్ నమిలినట్లుగా ఉంటుంది. కాబట్టి, వీటిని తినకపోవడమే మంచిది. ఇక చూడడానికి పనీర్ కాస్తా తెలుపు రంగులో ఉంటుంది. మరీ సున్నంలా ఉండదు. కానీ, కల్తీ పనీర్ చూడ్డానికి మరీ తెల్లగా ఉంటుంది.

### అయోడిన్ టెస్ట్



ఈ అయోడిన్ టెస్ట్‌తో ఈజీగా కల్తీ పనీర్‌ని గుర్తించొచ్చు. దీనికోసం ఉడికించిన పనీర్ ముక్కలపై కొద్దిగా అయోడిన్ వేయడం, ఉప్పు చల్లడం వల్ల అది బ్లూ కలర్‌లా మారితే అది ఖచ్చితంగా కృత్రిమమైనదేనని అర్థం చేసుకోండి. ఇది చేయడం కూడా చాలా ఈజీ.

### పనీర్‌తో లాభాలు



పనీర్‌లో కాల్షియం, పాస్ఫరస్ ఉంటాయి. ఇవి ఎముకల బలానికి చాలా మంచిది. పనీర్‌ని తినడం వల్ల ఆస్టియోపోరోసిస్, ఎముకలు విరిగిపోవడం వంటి సమస్యల్ని దూరం చేసాయి. ఇందులో ప్రోటీన్ ఎక్కువగా, కార్బోహైడ్రేట్ కంటెంట్ తక్కువగా ఉంటుంది. కాబట్టి, కండరాలు పెరుగుతాయి. బరువుని కంట్రోల్ చేసుకోవచ్చు. ఇందులో అమైనో యాసిడ్స్ ఉంటాయి. ఇవి కండరాల పెరుగుదలకి చాలా మంచిది. పనీర్‌లో శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవి తీసుకోవడం వల్ల ప్రోటీన్, కాల్షియంలు సరిపోతాయి. దీనిని తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పెరుగుతుంది. గట్ హెల్త్ బాగుంటుంది. పనీర్‌లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. కాబట్టి, బ్లడ్ షుగర్ లెవల్స్ త్వరగా పెరగవు. అయితే, సరైన మోతాదులోనే తీసుకోవాలి. లేదంటే సమస్యలొచ్చే అవకాశం ఉంది. అయితే, ఇవన్నీ సరైన పనీర్‌ని తిన్నప్పుడే జరుగుతుంది. లేదంటే చాలా సమస్యలొస్తాయి.